క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల మోడల్ జూనియర్ కాలేజీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అమ్మాయిలకు హాస్టల్ వసతి ఉందన్నారు.

నేటి నుంచి చిరుతల రామాయణం

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లిలో నేడు(ఆదివారం) నుంచి ఈ నెల 9 వరకు చిరుతల రామాయణం పౌరాణిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు చిరుతల రామాయణ బృందం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4న శ్రీరామ జననం, 5న సీతరామ కల్యాణం, 6న జటాయువు వధ, 7న కిష్కింద కాండ, 8న లంక రావణవధ, 9న శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, భజన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామాయణ ఘట్టాన్ని వీక్షించాలని కోరారు.

సమీక్ష సమావేశం



మల్హర్: మండల ఎంపీడీఓగా ఎస్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీఓగా పని చేసిన శ్యామ్ సుందర్ గత నెల 30న పదవీ విరమణ పొందాడు. కాగా అతని స్థానంలో శ్రీనివాస్ ఎంపీడీఓగా వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పంచాయతీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వివరాలు, ఉపాధి పనులపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ గిరి హరీశ్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

ఏటూరునాగారం: మండలంలోని శివాలయం వీధిలో తోకల లక్ష్మి అనే వృద్ధురాలిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. ఇంటిలో నిద్రిస్తున్న ఆమె తలపై రాయితో మోదగా తలపగిలి రక్తం వచ్చింది. మెలుకొని గట్టిగా ఆరవగా భయంతో పారిపోయినట్లు బాధితురాలు తెలిపారు. శనివారం విషయం తెలుసుకున్న ఎస్సై తాజొద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



వాజేడు: మండల పరిధిలోని నాగారంలో తాగు నీటి పైపు లైన్‌కు శనివారం మరమ్మతులు చేశారు. నాగారం గ్రామంలోని పలు వీధులను తాగు నీరు అందించే పైపులైన్ పగిలిపోవడంతో గ్రామస్తులు తాగు నీటికి ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం పంచాయతీ సిబ్బంది వెంటనే మరమ్మతు చేశారు.

అరకొరగా పారిశుద్ధ్య పనులు

రోడ్లపైనే మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పలిమెల : సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గత ఏడాది జనవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అరకొరగానే సాగుతున్నాయి. పలు గ్రామాల్లో వర్షాకాలం నీటి మడుగులు ఉన్నట్లు వేసవిలోనూ అదే తీరు కొనసాగుతోంది. చిన్నపాటి కాల్వ తీసినా నీరు నిల్వకుండా చేసే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైనా బోడాయిగూడెంలోని ప్రధాన వీధిలో సైడ్ డ్రెయిన్ లేకపోవడంతో ఇళ్లలో వాడుతున్న నీరు రోడ్డుపై చేరి ఎటూ వెళ్లకపోవడంతో రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. అదేవిధంగా మండలంలో సర్వాయిపేటలో బీసీ కాలనీలో ప్రధాన కూడలి వద్ద రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటుంది. దీంతో గ్రామంలోని ప్రజలు అటుగా వెళ్లాలంటేనే ఇబ్బందుకు పడుతున్నట్లు తెలుపుతున్నారు.



సైడ్ కాల్వలు లేకపోవడంతో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

అధికారులు రావడం లేదు



మా గ్రామం పలిమెలకు అనుబంధ కావడంతో పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు మా గ్రామానికి రావడం లేదు. నీరు నిలుస్తుందని అనేక సార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదు. రోడ్లపై నీటితో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డు పై ఉన్న నీటి నిలవ్వను తొలగించి సైడ్ కాల్వలు ఏర్పాటు చేయాలి.

– కాల్వపెల్లి శేఖర్, బోదాయిగూడెం

సర్కారు నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం



కాళేశ్వరం: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మల్హర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాళేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతోనే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, అకాల వర్షాలతో పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. శనివారం మహదేవపూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ.. ఇరువై రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే మ్యాచర్ రాలేదంటూ కాంటాలు పెట్టకపోవడం మూలంగానే పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిందని ఆరోపించారు. రైతులకు నష్టం జరిగితే అడిషనల్ కలెక్టర్ వచ్చి చూసివెళ్లాడే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం ఇప్పించి ఆదుకోవాలన్నారు. అలాగే శ్రీపాద ట్రస్ట్ పేరున పంట నష్టపోయిన రైతులకు రూ.పదివేల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన కిషన్, వెంకటేష్ శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంథనిలోని అతడి నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, తాడిచర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: రాజ్యాంగాన్ని తొలగించాలనే బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. శనివారం జై బాపు, జై భీం, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరెపల్లి–గుమ్మడవెల్లి, వెల్లంపల్లి–ఎంపేడు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్‌ను అవమానించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రాల కిరణ్, రమేశ్, ఆకినపల్లి మహేందర్, వెంకన్న, కోరె చందు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

విమర్శలు చేయడం మానుకోవాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో రెండు రోజుల కిందట వర్షానికి వరిధాన్యం తడిసి, కొట్టుకుపోతే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మొసలికన్నీరు కారుస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోట రాజబాపు, మాజీ ఎంపీపీ రాణిబాయి, గుడాల శ్రీనివాస్, వామన్‌రావు, సమ్మయ్య, సుధాకర్‌లతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బ్యాక్‌వాటర్‌తో నీటమునిగిన పంటలకు సర్వేలు చేశారు తప్ప పరిహారం ఏనాడు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అకాల వర్షంతో ధాన్యం తడిసి, వరదలో కొట్టుకుపోతే అనవసరపు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి వెంటనే కలెక్టర్‌తో పాటు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి, 25 ట్రాక్టర్ల తడిసిన ధాన్యం మిల్లులకు పంపినట్లు తెలిపారు. పుట్ట మధు విషయాలు తెలుసుకోని మాట్లాడాలని విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి రెండు వాహనాల్లో దాదాపు 43 పశువులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా కంటెనర్, బొలెరో వాహనాల్లో పశువులు తరలిస్తుండగా వాహనాలను స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పశువులు తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి, 43 పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.



వాహనాల్లో తరలిస్తున్న పశువులు

గొత్తికోయల ఇళ్లు ధ్వంసం

వెంకటాపురం(ఎం): ఇటీవల వీచిన ఈదురు గాలులకు గొత్తికోయలకు చెందిన పెంకుటిళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. మండలంలోని బుర్గుపేట పరిధిలోని సాకిరేవు గొత్తికోయ గుంపులో ఈదురుగాలులకు పెంకులు లేచిపోయాయి. అదేవిధంగా అటవీప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలకు చెందిన ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు బాధిత గొత్తికోయలు శనివారం తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లితహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ మొగిలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకరిరామ చంద్రయ్య, నాయకులు దాట్ల శ్రీనివాస్, బుర్ర కొమురయ్య, అంబాల శ్రీనివాస్, ముంజాల రవీందర్, రాంనేని రవీందర్, జోరు రాము పాల్గొన్నారు.

స్థల పరిశీలన

గణపురం: మండలంలోని చెల్పూర్‌లో బస్టాండ్ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కేటీపీపీ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెల్పూర్ చౌరస్తాలో ప్రయాణికుల సౌకర్యార్థం సీఎస్ఆర్ నిధులతో బస్టాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.5కోట్ల నిధులతో అత్యాధునిక హంగులతో బస్టాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగొలు కేంద్రాల్లోకి ధాన్యం తీసుకు రావాలని, దళారులను నమ్మి మోసపోద్దని సూచించారు.



భూపాలపల్లి రూరల్: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు కొండంత అండ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్‌రావు, నాయకులు కాయితీ లింగాచారి, బండారి చంద్రయ్య, నునావత్ శ్రీనుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన కల్లూరి రవికిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సీఐటీయూ అనుబంధ కార్పెంటర్ యూనియన్ నాయకులు శనివారం పరామర్శించి రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదపాక బ్రహ్మం, కట్ల నర్సింహాచారి, పోన్నాడ సత్యనారాయణ, యన్నమల్ల రవి, గడ్డం శ్రీను, వంశీ, రాము, కృష్ణ, శివకుమార్ ఉన్నారు.

పోలీసుల తనిఖీ

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామంలో స్నిపర్ డాగ్‌తో ఎస్సై తాజొద్దీన్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కిరాణం షాపులు, అనుమానిత ఇళ్లను సోదాలు చేశారు. వాహనాలను కూడా తనిఖీ చేసి అనుమానితుల వివరాలను సేకరించి వదిలేశారు. గంజాయి, మత్తు పదార్థాలు వంటివి ఎవరి దగ్గర ఉన్నా వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాలను నివారించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు మనోజ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం వరదలో కొట్టుకుపోవడానికి కారణమైన నిర్వాహకులపై చర్య తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వ్యవసాయశాఖ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువు వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన పీఏసీఎస్ సిబ్బంది, ఇన్‌చార్జ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. ఆయన వెంట ఆకుల శ్రీధర్, అడప లక్ష్మీనారాయణ, రవి, వంశీ, పూర్ణచందర్, రాజులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మొగుళ్లపల్లి: ఇప్పలపల్లి గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సునీతకు ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ దూడపాక శ్రీకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. పబ్లిక్ వాటర్ నల్లాల ద్వారా నీరు రావడం లేదని రెండు బోరింగులు పనిచేయడం లేదన్నారు. వాటిని రిపేర్ చేయాలని మిషన్ భగీరథ ద్వారా గ్రామానికి సరిపడ నీటిని పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఇప్పలపల్లి గ్రామస్తులు పెన్షన్ కోసం ఆకినపల్లికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇప్పలపల్లిలోనే పెన్షన్ ఇచ్చే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమేశ్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకృష్ణ

ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు

భూపాలపల్లి అర్బన్: ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రవినారాయణరెడ్డి భవనంలో పతాక ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పహల్గాం ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడి ప్రజాస్వామ్య విలువలపైన జరిగిన దాడిగా చూడాలన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాత్కు ప్రవీణ్‌కుమార్, జోసెఫ్, రమేష్‌చారి, భగత్, తిరుపతి, పవన్, అభిలాష్, సాయి, ఆదిత్య పాల్గొన్నారు.



పతకావిష్కరణ చేస్తున్న శ్రీకాంత్

రోడ్ల పక్కనే చెత్తాచెదారం



మార్కెట్ యార్డు సమీపంలో వేసిన చెత్త



శివాపురంలో రోడ్డు పక్కన వేసిన చెత్త

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా డంపింగ్‌యార్డు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో సేకరించిన చెత్తను రోడ్డు పక్కన, చెరువులో వేయటంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. రోడ్డు పక్కన పడేయడంతో దుర్వాసన వస్తోందని పలువురు వాపోతున్నారు. అలాగే పడేసిన చెత్తకు నిప్పు పెడుతుండటంతో పొగకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన చెత్త వేసి నిప్పు పెట్టి ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్మి కంపోస్టు షెడ్లలో చెత్తను వేరు చేయడం, ఎరువులు తయారు చేయటం వంటి పనులు చేపట్టడం లేదు. పంచాయతీలో సేకరించిన చెత్తతో పాటు ప్లాస్టిక్ కవర్లు తదితర వస్తువులు, వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేయకుండా రోడ్డు పక్కన, బోడ చెరువులో పడేసి తగల బెట్టడం వలన వచ్చే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు సైతం అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డులోనే చెత్త వేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



పంచాయతీల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును అధికారులు వినియోగంలోకి తీసుకురావాలి. రోడ్డు పక్కన చెత్తచెదారం వేయకుండా చర్యలు చేపట్టాలి. డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన వర్మికంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చి కంపోస్టు ఎరువు తయారు చేసేలా అధికారులు చూడాలి.

– తంగెళ్లపల్లి ప్రసాద్, వెంకటాపురం(కె)

చర్య తీసుకోవాలి



చెత్త చెదారం రోడ్డు పక్కన వేసి చెత్తకు నిప్పు పెట్టే వారిపై చర్య తీసుకోవాలి. రోడ్డు పక్కన, చెరువులో చెత్త, వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వస్తోంది. దీంతో రోడ్డుపై ప్రయాణించేదుకు ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కట్ల నర్సింహాచారి, వెంకటాపురం(కె)

అప్పల బాధతో యువకుడి ఆత్మహత్య



రాజేందర్(ఫైల్)

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో కాటారం మండలం చిదనపల్లి గ్రామానికి చెందిన మార్క రాజేందర్ (37) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం కేంద్రంలో రాజేందర్ ఫర్టిలైజర్ షాపును నిర్వహిస్తున్నాడు. రైతులు ఎరువులను ఉద్దేరకు తీసుకొని డబ్బులు సమయానికి ఇవ్వకపోవడంతో రూ.20 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఏప్రిల్ 28న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. శనివారం మహదేవపూర్ పరిసర ప్రాంతాల్లోని అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉరి వేసుకొని మృతిచెంది కనిపించాడు. రాజేందర్ భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు మహదేవపూర్ ట్రెయినీ ఎస్సై శశాంక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.